మన మణి మాణిక్యాలు

దిగవల్లి వేంకట శివరావు

[ఫిబ్రవరి 14 జన్మదినం]



1898 వ సంవత్సరం చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ దొర స్వర్గతి చెందారు. ఆయన తెలుగు భాషా సాహిత్యాలను గొప్పగా ప్రేమించారు. మన పాత తాటాకు గ్రంథాల వల్ల ఆయన చూపిన అభిమానం అనిద్యశం. ఈస్టిండియా కంపెనీ పరిపాలన వల్ల మనకు కలిగిన గొప్ప లాభాలలో చెప్పదగింది థామస్ మన్రో ఆర్థర్ కటన్, చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వంటి మహోదారులు, పరిపాలనాదక్షులు, నిస్వార్థ ప్రజాసేవా పరాయణులు ఆంధ్ర దేశానికి అధికారులు కావడం అంటారు దిగవల్లివారు. ఈస్టిండియా కంపెనీ కాలపు చరిత్రకు సంబంధించిన కవిలెకట్టలు దిగవల్లివారు సేకరించినన్ని ఆంధ్రదేశపు ఆధునిక చారిత్రకు లెవ్వరూ పోగుచేయలేదు. అధ్యయనం చేయలేదు. 18, 19 శతాబ్దాల చారిత్రక ప్రాముఖ్యం గల ముఖ్య ఘట్టాలన్నీ ఆయన చేతివేళ్లపై ఉండేవి. తేదీలు, సంఘటనలు ఆయన హృదయంలో పదిలంగా ఉండేవి. 18, 19 శతాబ్దులకు చెందిన ముద్రిత ముద్రిత గ్రంథస్థాధార సాక్ష్యాలు ఆయనకు తెలిసినంతగా మరెవరికీ తెలియకపోయేవి.

పందొమ్మిదో శతాబ్ది ఉత్తరార్థంలో మద్రాసు నుంచి వెలువడ్డ అపురూపమైన ఇంగ్లీషు పత్రికలు, తెలుగు పత్రికలూ ఆయన చూశారు. 18..లో బహుజనపల్లి సీతా రామాచార్యులు ప్రభృతులు నడిపిన సుజనరంజని - *A friend to the University Students* అనే సాహిత్య మాసపత్రిక వారి వద్ద ఉండేది. అట్లానే మద్రాస్ జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన సెట్టు ఎంతో ఉండేది. బందరు నుంచి 18..లోనే ప్రారంభమైన పురుషార్థ ప్రదాయిని పత్రికా సంపుటా లుండేవి. కొక్కొండ వేంకటరత్నం పంతులుగారు నడిపిన ఆంధ్ర భాషా సంజీవని ఇక ఇప్పుడెవరూ చూడలేరు. ఆ పత్రిక 30 ఏళ్లు వచ్చింది. వేంకటశివరావుగా రా పత్రిక చూశారు. కొమర్రాజు లక్ష్మణరావు గారి వ్యక్తిగత గ్రంథ సంచయంలో ఆ పత్రికా సంపుటా లుండేవట. లక్ష్మణరావు పంతులుగారు విజయవాడలో వెలిదండ్ల హనుమంతరావు గ్రంథాలయానికి తన గ్రంథ సంచయాన్ని బహూకరించారు. అప్పుడు శ్రీ శివరావుగారు ఆంధ్ర భాషా సంజీవని నుంచి నోట్సు రాసుకున్నారు. తరువాత హనుమంతరాయ గ్రంథాలయంలో అగ్నిప్రమాదం సంభవించి చాలా పుస్తకాలు సుందరకాండలో లంక వృత్తాంతంలో చేరిపోయాయి. తర్వాత మరి శివరావుగారి 'నోట్సే' ఆధారమైంది.

ఆంధ్రులు అలసబుద్ధులు. సంస్థా నిర్మాతలే కాని, నిర్వాహకులు కారు. ఉదారులు కారు. సంస్కార పరిరక్షకులు కారు. టేకుమళ్ళ రాజగోపాలరావు గా రనే గొప్ప చరిత్ర రచయిత ఉండేవారు. ఆయన రచనలన్నీ విజయవాడలో ఒక గ్రంథాలయంలో ఉండేవి. అవి లయమైంది.

ఇంతకూ చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ గారికీ, వేంకట శివరావుకీ ఏమిటి సంబంధం? బ్రౌన్ దొర చనిపోయిన సంవత్సరమే శివరావుగారు పుట్టారు. కంపెనీవాళ్ళ జమా లెక్కలన్నీ భద్రపరిచారు శివరావుగారు. శివరావు గారు జాతీయాభిమానోద్యోగి. ఆయన ప్రభావశీలమైన వయస్సులో వందేమాతరం, సహాయ నిరాకరణం, సత్యాగ్రహం వంటి భారత జాతీయ స్వాతంత్ర్యోద్యమా లిన్నీ ఆయన సంస్కారాన్ని వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. వృత్తిరీత్యా వారు న్యాయవాది అయినా ప్రవృత్తి రీత్యా గొప్ప చరిత్ర పరిశోధకులు. సారస్వతవేత్త, సహజ పరిణామ అధ్యయనశీలి. సుప్రీమ్ కోర్టు చీఫ్ జస్టిస్ పదవి నలంకరించిన శ్రీ కోకా సుబ్బారావు మహాశయులు న్యాయశాస్త్ర కళాశాలలో దిగవల్లివారి సహాధ్యాయి. ఒకసారి శ్రీ సుబ్బారావు విజయవాడ న్యాయవాద సంఘ సమావేశానికి వచ్చినప్పుడు ఎట్లా సాగుతోంది మీ సాహిత్య చారిత్రక పరిశోధన అని దిగవల్లివారితో సల్లాప సంభాషణ జరిపారట. జీవితాంతం అధ్యయనే చరించారు శివరావుగారు. రాజకీయులకు అప్రియమైన సత్యాలు చెప్పడానికి ఆయన వెనకాడలేదు. అందువల్ల మనత వహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కాని, సుప్రతిష్ఠ పొందిన విశ్వవిద్యాలయాల నుంచి కాని ఆయనకు పురస్కారాలు, బిరుదులు, సన్మానాలు ఏవీ లభించలేదు. స్వీయ ప్రతిభా ప్రచార ధోరణులంటే ఆయనకు చాలా కోపంగా ఉండేది. ఆయన ప్రచురించిన కథలు, గాథలు సంపుటాలు చాలా విలువైనవి.

కాశీ మసీదులో శివలింగం, తురకల దౌర్జన్యాలు, చెన్నపట్నం గవర్నరుకు శిక్ష విధించిన దివానులు, జగద్గురు తత్త్వ బోధకస్వామి అనే రాబర్ట్ డి నొబిలి అనే కథలు, గాథలతోపాటు కుంఫిణీ కాలపు చిత్ర విచిత్ర లెన్నో ఆయన ఈ సంపుటాలలో ఆసక్తికరంగా చెప్పారు.

1957 పూర్వరంగాలు - శ్రీ శివరావుగారి ప్రశస్తరచన. అప్పటి కలకత్తా, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో జాతీయ కాంగ్రెసు ప్రాదుర్భావానికి ముందు స్వాతంత్ర్యోద్యమ చైతన్య ప్రబోధ రంగస్థలాన్ని నిర్వహించిన ఎందరో మహనీయుల గురించి ఆసక్తికరంగా చెప్పారు శివరావుగారు. ఏనుగుల వీరాస్వామయ్యగారి కాశీయాత్ర చరిత్ర ఆయన భద్రపరచకపోతే తెలుగువారి పందొమ్మిదో శతాబ్ది సాంఘిక చరిత్రకు ప్రధానాధార గ్రంథం ఏమైపోయేదో! ఎక్కడ పోయేదో! అనాటి వింతలు, విశేషాలు, ఎన్నో తర్ఫీళ్లు రాశారు ఈ గ్రంథానికి శివరావుగారు. బెజవాడ న్యాయవాద వ్యవస్థ చరిత్ర రాశారు. పోలీసువారి పుట్టు పూర్వోత్తరాలు చెప్పారు. సన్యాసుల స్వాతంత్ర్య సమరాలు సంధానించారు. వీరి గ్రంథాలలో మన ఆంధ్రత్వం, విస్మృతాంధ్రం, విశాలాంధ్రం గొప్పగా చెప్పదగినవి. ఆయన రచించిన తెలుగు రచనలు చదవడం వల్లనే తమకు రాజకీయ, చారిత్రక పరిణామ పరిజ్ఞానం కలిగిందన్నారు వావిలాల గోపాలకృష్ణయ్యగారు. 'ప్రళయ నాయకుడు' అనే చారిత్రక రూపకాన్ని విశ్వనాథ సత్యనారాయణగారు దిగవల్లి వారికి అంకితం చేశారు.

ఇంకా నెల రోజులలో చనిపోతా రనగా కూడా మధ్యప్రదేశ్‌లో ఉండి కూడా రాత అపాల్యాబాయి, నర్మదానది, తపతీ నదులకు సంబంధించి చారిత్రక జిజ్ఞాసతో కాలం గడిపిన చరిత్ర పరిశోధన తపస్వి శ్రీ దిగవల్లి వేంకటశివరావు. 1992లో ఆయన దివి కేగారు.

— అక్కిరాజు రమాపతిరావు -